# గద్దెత్కపోయిన బత్కమ్మ

సె రువుల మోకాలు బంటంత నీల్లు లేకున్నా బత్కమ్మ పూలతో సెంగలిచ్చి పొంగుతంది సెరువు. యిదివరకు మూడొందల ఎకురాలుండేదట. సలికాలం ముసలమ్మ తోలోలె దగ్గెరవడ్డది. సెరువు సుట్టు గుంపులు గుంపులుగ సిల్కు సీరెలు, పూల సీరెలు, మెరుపు సీరెలు, సప్పట్లతోటి, పాటల్తోటి సెరువు నీల్లుగూడ తపుకు తపుకు మనుకుంట దరువు గలుపుతున్నయి.

'ఓ పిల్ల తిండ్లేదే జెర సప్పట్లు గట్టిగ్గొట్టరాదే తటుకు తటుకునేందే పాశాట గొట్టినట్టు లెగ్గాంచి కొట్టే..' ఓ నడీడామె పక్కపొంటి పొల్లను ఉసిగొడ్తంది. సంక పిల్లలు మొగొల్ల సంకలెక్కి ఎగురుకుంట మొగ్గ సేతుల్ని పూలోలె యిచ్చుకొని సప్పుడురాని సప్పట్లు కొడ్తండ్రు. సిన్న పిల్లలు ఆడిపాడే ఆడోల్ల కాల్లసుట్టు అడ్డంగ తిరుగుతుండ్రు. బత్కమ్మ పూలకాడికి బొయి పూలను పీక బోతుంటే

'వద్దు బిడ్డా బత్కమ్మ కొడ్తది' అని దగ్గెరకి గుంజుకొచ్చుకుంటండ్రు తల్లులు. సెరువుకొమ్ముకు సూదరోల్ల ఆడోల్ల గుంపాడ్తాంటే సెరువు కిందికి మాదిగ, మన్నెపాడోల్లాడ్తాండ్రు. వయిసు మొగోల్లు అన్ని గుంపుల దగ్గెరికి బొయి, తీరొక్క బత్కమ్మల కంటె తీరొక్క సీరెలు గట్టిన, వోణీలేసిన ఆడి బత్కమ్మల్నే కండ్లు నింపుకొని గుండె సెదురుకుంట సూస్తున్నారు.

గూడెం ముసలాడోల్లు, ముసలి మొగోల్లు పూరి బత్కమ్మలు సూసొచ్చి సెరువు కిందికొచ్చి 'గా సూదరోల్లు ఒక్కతన్న పదమెల్ల పాడ్తలేదు' దూత్తెరి ఏం రాగం దీత్తరో ఏమో' ఓ ముసలమ్మ గునుస్తంది.

'ఏంది దేవక్కా మీవోల్లు గా కింది మొకాన ఆడ్తాంటె నువ్వు గీడున్నవేంది గౌండ్ల రామన్నడిగిండు. సెరువు కొమ్ముదిక్కు వచ్చిన దేవమ్మను జూసి'....

'అగ్గో గదేమ్మాటే... గామె గీ వూరికి సర్పంచి, గామెకిష్టమైన గుంపుకు బొయి ఆడ్తది పాడ్తది. నిలుసున్నవేంది దేవక్కా పో ఆ గుంపుకుబొయి ఆడుపో' అన్నడు వీరేశం అనే యూత్ పిలగాడు.



Scanned by CamScanner

'ఏ.. పిలగా సదువుకున్న మాటలా... గాల్లు బత్కమ్మాడొద్దు ఎరికేనా.... వూరికి సర్పంచే కావచ్చు బతుకమ్మగ్గాదు'.

'అగ్గో వాల్లెందుకాడద్దే....'

ఎందుకంటె ఆల్ల కులంల 'ఎవతో గర్కాసి జేసిన లెక్కలకు ఆల్లు బత్కమ్మాడకుంట్రైంద్రు' అన్నడు గౌండ్ల రామన్న దీర్గిచ్చి. దేవమ్మకు ఆ మాటలు కడుపుల గడ్డపారేసి దిగేసి నట్లయింది.

'ఓ.... రామన్నా జెర మంచిగ మాట్లాడు. మా కులపామెను నా ముందట్నే ఎవతో గర్కాసిదంటవేంది మీరే మా బత్కమ్మను మాగ్గాకుంట జేసింద్రు' అని సర్పంచి దేవమ్మ నోరు నెత్తిన వెట్టుకోంగనే జనం గుంపైంద్రు. గౌండ్ల రామయ్య జెర భయపడ్డడు. అయినా మల్లా 'అయ్యో వున్న మాటే అన్న దేవమ్మా... వూల్లె యెవల్నన్నా అడుగు బిడ్డా... మీరు బత్కమ్మాడద్దని సాపెనే వుండె నామీద కోపానికత్తెట్ల.'

'ఏందాట, ఏందాట ఎంది లొల్లి అని వాల్లొగరీల్లొగరు అడుగుతు అండ్ల యింకో పెద్దమనిషి 'అవుబిడ్డా మీకు యిదివరకు ఎప్పుడో ఎనుకట వుండెనాట గనీ యిప్పుడు లేదుబిడ్డా తప్పేమన్నడు అవద్దమైతె మీ పెద్దమన్సుల్ని అడుగు' కట్టెకు పుల్లోలె సదిరి సెప్పిండు.

'మీకు బత్కమ్మ లేకున్నా జిద్దుకు ఆడవడ్తిరి మా మీద పోటికి. గా పాపానికే సెరువుల్ల, కుంటల్ల నీల్లెందుక పోతన్నయి' యింకో పిల్లనెత్తుకొని నిలుసున్న రాయపోషయ్య మాట గలిపిండు.

"ఏందీ ఏమన్నవూ.... మా పాపాలా?" అని యాత్ సంగం సామి, రాయపోషయ్య మీదికి బొయిండు. రాయపోషయ్య 'ఏందిరో కొడ్తవా ఏది కొట్టు' అని పిల్లను దించబోయి ఏద్వంగనే మల్లెత్తుకున్నడు.

'ఆ... పొయి పొయి నిన్నేగొట్టాలే నిన్ను గొట్టినా కుక్కను గొట్టినా వొకటే' సామి కోపాన్ని ఆపుకుంట....

యింతల గూడెం మొగోల్లు పిల్లలు గూడ గుంపు గూడింద్రు. 'ఏమైంది దేవక్కా ఏంది గీడున్నవు' బాబు అనే ఇంకో పిలగాడు దేవమ్మ దగ్గెరికి ఒచ్చి మల్లా...

'గీ కొన్న అడ్డం దొడ్డం కాయితం బత్కమ్మల నేంజూత్తవ్, మన బత్కమ్మల కాడికిరా.... సందమాయ అసొంటి పూలతోని పేర్సిన తీరొక్క బత్కమ్మల చూసొద్దువు రా. సూత్తెనే కండ్లు పెయి తిరుగుతన్నయి రాక్కా'. అన్నడు.

వూరి బత్కమ్మల్ని తీసేసినట్టు మాట్లాడంగనే సాలోల్ల రాజన్నకు సుర్రున కోపమొచ్చింది



Scanned by CamScanner

కాని కోపాన్ని మింగుకోని 'ఇగో ఏళ్ళన్నీ ఒక్క తీరుగ లేవు తమ్మీ' సిన్నంత్రం పెద్దంత్రం జూడాలె, ఎటుబడి మీ వోల్లు సర్పంచైంద్రని ఎట్లబడితట్ల మాట్లాడుడేంది గిది పద్ధతి గాదు...

నిజంగానే మీకు బత్కమ్మ ఎనుకటి కాంచే లేదాయె గదెన్నడో గద్దెత్కపాయె' అని సాగదీసి మాట్లాడిండు. సామికి బుస్సున కోపమచ్చి 'ఏ ఎవ్వడే లేదని సెప్పింది వానవ్వందెంగ'

'ఏయ్ మాట మంచిగ రానియ్ అవ్వగివ్వంటవేందిర' అని కాపోల్ల బాలకృష్ణ సామి మీదికి రాంగనే కోపంగున్న సామి కొట్టబోయిండు. యింతల బాలకృష్ణోల్లు, గూడెపోల్లు సర్పంచి దేవక్క కల్సి ఎటోల్లనటు యిగ్గుకపోయింద్రు.

'సర్పంచి మీ వోల్లనార... గింత ఉచ్చిలిపాటు' బాలకృష్ణ.

'ఏ... ఎవనికిరా సర్పంచి... గదో సర్పంచి దానికో నీలుగుడు. నీయవ్వా సర్కారుకు సిగ్గుండాలె గొడ్డు తునకల్దినే మాల మాదుగుల్ని మా తల్కాయల మీన గూసోబెట్టి తమాషా జూత్తంది'. వూరి గుంపుల ఎవరో అన్నరు. 'ఏ నన్నిడ్సి పెట్టుండ్రి గాల్లెట్ల మాట్లాడ్తుండ్రో.... యింటండ్రా... యిన్నొద్దులోల్నే వుండాలనుకుంటండ్రు కొడుకులు' సామి పట్టుకున్నోల్లని యిడిపిచ్చుకుంట.

'మాకాట బత్కమ్మలేదాట బత్కమ్మ. యీనింట్ల బత్కమ్మ ఎత్కపొయాడినట్టు కండ్లల్ల మంటలు వెట్టుకుంటండ్రు' దేవమ్మ రెచ్చిపోకుంట వాల్లను వీల్లను సముదుసేసి సెరువు కింద ధూంధాంగ ఆడుతున్నోల్ల దగ్గెరికచ్చింది, గూడెం యూత్‌ను తీసుకొని.

దేవమ్మ ఆ వూరికి సర్పంచి. తెలంగాణ పార్టీ నుంచి గెల్చింది. ఐద్దాక సదివింది, పెనిమిటి గ్యాసునూనె డీలరు. వూల్లె చాలా హుషారుగ పనుల్జేస్తుంటదని, తెలివి కల్లదని, మంచి మనిషని వూల్లె మెచ్చుకుంటరు. దేవమ్మ రాకముందు రోడ్లు లేకుండె, లైట్లు లేక వూరంత సీకటిగుండె, బోరింగులు పడావు బడి వుండె. దేవమ్మ సర్పంచిగ గెల్సి, గవన్ని బాగుజేయించింది. కొన్ని కొత్త బోరింగులు గూడ ఏయించింది.

'యిల్లు పొల్లును బట్టక, పిల్ల జెల్లను జూడక, వూరు వూరని సత్తవేందే... వూరు బువ్వ బెడ్తదా గంజి బోస్తదా! ఎవ్వని కక్కెరి కచ్చే వూరే'... అని పెనిమిటి దిట్టేది.

గివ్వేంబట్టక దేవమ్మ వూరి పనుల్జేసింది. కాలుకు బట్ట గట్టకుంట తిరిగి ముసలోల్ల పెన్షండ్లు యిప్పిచ్చింది. చాన మందికి వూరు వాడని తేడ లేకుంట తెల్ల రేషన్ కార్డులు, అన్నపూర్ణ, అంత్యోదయ కార్డులిప్పిచ్చింది. వాల్లంత సేతులెత్తి మొక్కుతుంటరు. దేవమ్మ గీ జెన్మకిది సాలనుకున్నది. దేవమ్మకు బత్కమ్మ పండుగంటె శానిష్టం వుండె కష్టంజేసుకునే ఆడోల్లు ఏడు ముట్టెల్ల కాలం పాత సీరెలు, సినిగిన సీరెలు, బురద, మట్టి సెమటతోనే తెల్లార్తరు. గీ పండుగచ్చిందంటే సిల్కుసీరెలు, సీటీ సీరెలు గట్టుకొని కడుపుల దాసుకున్న



Scanned by CamScanner

పాటలన్ని సంబురాలన్ని సప్పట్లతోని కలుపుకుంటరనుకునేది.

కానీ గీ బత్కమ్మలు గూడెపు ఆడోల్లకు లెవ్వని 'సర్పంచిగ గెలిస్తే ఎస్సీ వాడల్ల బత్కమ్మ ధూంధాంగ, వూరి బత్కమ్మలు కింద పడేటట్లు ఎస్సీ బత్కమ్మల్ని ఆడిపియ్యాలె నాకున్న మంచి తనంతోని ఎవ్వరేమనరు' అనుకున్నది.

యిదివరకు వూరు ఆడోల్లు ఆడ్తాంటె గూడెపోల్లందరు సూడనీకి పొయ్యేటోల్లు. తర్వాత సెరువు కింది వాయికి పోయి చిన్న పిల్లల్ని మద్యల కూసోపెట్టి ఆడిపాడి బత్కమ్మాడిన కుతి తీర్సుకునేటోల్లు.

ఈ సందర్భంలనే బత్కమ్మల్ని వూరూ వాడా పెద్ద ఎత్తున జరుపాలెనని తెలంగాణ పార్టీ పిలుపిచ్చింది. మన్సుల కోరికకు పార్టీగూడ తోడైనందుకు 'పార్టీ సల్లగుండ'నుకున్నది. దానికి సంబంధించి వూల్లె పార్టోల్లతోని మీటింగు గూడ పెట్టి పార్టీ నిర్ణయం చెప్పింది.

అండ్ల రంగయ్యనే ఓ పెద్దమనిషి లేసి 'పార్టీ పిలుపిచ్చినా వూరి పద్దతులు గూడ సూసి, వాటికి లోబడే సెయ్యాలె' అన్నడు.

'అంటె... జెర అర్థమయేటట్లు సెప్పు పటేలా' సర్పంచి దేవమ్మ.

'ఏంజెప్పాలె... వూరుకు వాడకు తేడుండె... మీకు బత్కమ్మాడే రివాజే లేదాయె మీరు మా బత్కమ్మలతోని కలిసెట్లాడ్తరు?' కుండ ఎత్తేసినట్లన్నడు. అట్లనేవరకు దేవమ్మకు కడుపుల పేగులు సల్లబడ్డయి.

గీని గుండెకెన్ని నరాలు సర్పంచినన్న మర్యాద గూడ లేకుంటెట్ల మాట్లాడ్తండు గాడ్దికొడుకు' అని మనసుల తిట్టుకున్నది. నేను పనులు జేసినప్పుడు ఆహా ఓహో అన్నోడు మీరు, మేము అంత ఒక్కటే అన్నోడు, గిప్పుడు గిట్ల మాట్లాడ్తండు అనుకున్నది.

'ఓ.... రంగయ్య పటేలా గవన్ని మొన్నటికే పొయినయి. అందరు కల్సి ఆడుడు ఆడుడే.... గిది పార్టీ పిలుపు' మీటింగుల శంకర్ అనే ఓ యూత్ పిలగాడన్నడు.

'యొహే మీ గూడెపోల్లకు బత్కమ్మాట లేనే లేదాయె మీరెట్లాడ్తరు పిలగా... ఎందుకాడరో ఎరికేనా' రంగయ్య.

'గవన్ని మాకెరికే గిప్పుడు అందరు ఆడ్తరు సూడు' శంకర్.

'పట్టువట్టి లేనిదాడితే వూరు యిజ్జతేంగాను, యిర్తేంగాను'

'ఆ.... వున్నది యిర్తి గిదో వూరు దీనికో యిర్తి'....

దేవమ్మకర్తమైంది. గీల్లకు వూరు వాడ కల్సి ఆడే యిష్టం లేదు. అసలు గూడెపాడోల్లు కొత్త సీరెలు కట్టుకొని బత్కమ్మలాడ్తనే కండ్లల్ల వుచ్చబోసుకుంటం్రదు, ఎందుకు లొల్లి.



Scanned by CamScanner

'కడుపు సించుకుంటె కాల్ల మీద రోత' లొల్లి వద్దనుకున్నది.

పార్టీ పిలుపైనా కార్యక్రమమైనా వూరు బత్కమ్మ వూరు బత్కమ్మే, వాడ బత్కమ్మ వాడ బత్కమ్మే... గివి యిప్పట్ల కలువకుంటె కలువక పాయెగనీ, మీరు బత్కమ్మలాడొద్దనుడే కష్టమనిపిచ్చింది దేవమ్మకు. ఎక్కువ తక్కువలు మర్సి అందరు సమానమని మేమనుకుంటెట్ల వూరోల్లు గూడ అనుకోవాలె...

మాతోని పనులు సేయించుకునే కాడ కులం లేదుగాని..., మేము ఏర్కచ్చి ఇచ్చిన బత్కమ్మ పూలకు కులం లేదు గాని..., మేం బత్కమ్మలను ఆడుకునే కాన్నే కులం తక్కువయింది. మేమేమన్న కల్సి ఆడ్తమంటన్నమా అనుకున్నది. అయినా పట్టువట్టి శాన పూలు దెప్పిచ్చింది. గూడెంలల్ల గూడ వేర్వేరు వాడల్లున్న మాదిగ, మన్నెపోల్లనే కాక డక్కలి, చిందు, మాష్టి బైండ్ల ఆడోల్లందర్ని గూడేసి బత్కమ్మలు పట్టిచ్చి దప్పుల్తోని సెరువు కిందికి పైనంజేయించింది. గది సూసి వూరు గిస గిస గొట్టుకున్నది. కడుపు కుతకుత వుడికింది.

'గూడెం సర్పంచి సూసినవా... ఎంత పంజేసిందో దాని పట్టు నెగ్గిచ్చుకుంటంది. గాల్ల రాజబోగం జూడు గిదంత మా మొకం సిన్నతనం జేసే దానికే గద అయ్యో ఎన్ని రోజులీ వైబోగ'మని సేతులు పిసుక్కున్నరు వూరి ఆడోల్లు.

'గది కుట్టువెట్టుకొనే గీ లొల్లి జేసింద్రు' అని సర్పంచి దేవమ్మ కర్తమైంది. అందికే లొల్లిని పేంచి జెయ్యనియ్యలే... గుంపైన గూడెపోల్లను దీసుకోని చెరువు కిందికచ్చింది.

'రామ రామ రామ ఉయ్యాలో..రామనే సీ.. రామ ఉయ్యాలో...'

అని పాడ్తాంటె 'ఏ రాముడేంది రాముడు ఆ రాముని పాటలు బందు వెట్టుంద్రి శ్రీ రావణుడు' అని పాడుంద్రక్కా అని ఓ యూత్ పిలగాడు సిదురుకున్నడు.

గూడెపాడోల్లు కడుపుల ఎన్నటియో ఎనుకట దాసుకున్న పాటలు, ఆడనియ్యని కోపాలు, ఆటలు, సప్పట్లన్ని బత్కమ్మపూల సుట్టు సిందేసినయి. సెరువు కింది పాటల్ని సెరువు తన నెర్రెల్ల దాపెట్టుకున్నది. నోరార, కడుపార పాటలు పాడుకొని బత్కమ్మను నీల్లల్లేసుకుంట 'పో...పో..బత్కమ్మ పొయ్యిరా బత్కమ్మా.. పొద్దు వాయె బత్కమ్మా... మల్లరా... బత్కమ్మా...' అని బత్కమ్మను సాగదోలింద్రు.

తెచ్చిన సద్దుల పలారాన్ని 'సూడచ్చినోల్లకు పలారముల్లో...' అని పంచి పెట్టింద్రు.

దేవమ్మ గూడ నువ్వుల ముద్దలు, పల్లీల ముద్దలు, పెసరు ముద్దలు, సత్తుపిండి (మక్కపేలాల పిండిల బెల్లం కలుపుతరు) పంచి పెట్టింది. అందరు జమగూడి ఎందో



Scanned by CamScanner

గల్సినట్టు యింటిదారి బట్టింద్రు.

దేవమ్మ తన బిడ్డె స్వాతిని, గుంపులున్న అత్తను ఎనుకులాడుకొని 'ముసలవ్వ సెయిబట్టుకొని ఇంటికివో బిడ్డా....' అని సెప్పి గూడెం గుంపుల గల్సింది.

నడువలేని నాయినమ్మని బట్టుకొని నడ్సుకుంట 'ఏందె నర్సవ్వా గీ మందిల నువ్వెందుకచ్చినవే' అన్నది స్వాతి. 'అదె బిడ్డా... గీ బత్కమ్మలను నేంజూడద్దానె... అచ్చేటికుంటనో.. పోతనో... సాతీ.. నాక్కాల్లు లేవ లేక పోలే, గాలొల్లి కాడికి. ఏంలొల్లైంది బిడ్డా...' అడిగింది మన్మరాల్ని.

'మనకు బత్కమ్మల్లేవాట ఆడద్దని లొల్లి వెట్టింద్రు గా కాపోల్ల బాలకృష్ణోల్లు' 'అవు బిడ్డా గది నివద్దే'... కట్టెపొడుసుకుంట నడుస్తూ...

'ఎందుకె... నువ్వు గూడంటన్నవ్ మనకు బత్కమ్మెందుకులేదే..' జెర కోపంగ ప్రశ్నగా అడిగింది స్వాతి.

'మన బత్కమ్మను గద్దెత్కపాయిందాట' నర్సవ్వ

'సరింగ చెప్పే పొయి పొయి మన బత్కమ్మనే గద్దెందుకు ఎత్క పొయిందే'...

'ఎందుకంటె మనం రాసుకచ్చుకున్న రాత' నారాజుగ ముసలమ్మ.

'ఏ మంచిగ జెప్పు' విసుగు మొకంతోని స్వాతి.

'ఏమున్నదే అదో పెద్ద కత యింటికి బొయినంక జెప్త తియి నిమ్మలంగ' అన్నది. స్వాతికి బత్కమ్మను గద్దెత్కపొయిన కతను వినాలని బాగ బాగ కాయిసున్నది. ఇంటి వాకిట్లనే నాయినమ్మను పట్టుకొని నిలుసున్నది.

'మీ నాయినెటువాయెనే నీల్లారగియ్యాలె బత్కమ్మకాంచి వచ్చినోల్లకు' ముసలమ్మ నిలుసోలేనట్లు అన్నది. 'నేందెచ్చి ఆరగిస్తానే... వాల్లు లొల్లిలున్నరు' అని స్వాతి జాలాట్లకురికి సర్వతోని గోలెంల నీల్లు ముంచి తెచ్చి వాకిలి కొసకు నిలుసున్న నాయినమ్మ కాల్లమీంచి ఆరగిచ్చింది. కట్టెను నాయినమ్మను తీస్కచ్చి గడంచెల కూసోబెట్టి నీల్లు తాపిచ్చి 'గా బత్కమ్మ గద్ద కత సేప్పే....' అని మల్ల యాజ్జేసింది.

స్వాతి నాయినమ్మ కొంగున కట్టుకొచ్చిన బత్కమ్మలకాడ పంచిపెట్టిన పలారాలు యిప్పుకొని మనుమరాలుకు బెట్టి తను బుక్కుకుంట మొదలు బెట్టింది పుర్సతుగ. ఏమున్నదే...ఎన్నడో ఎన్కటనాట గీ బత్కమ్మలు మొదుగాల ఆడింది మాదిగాడోల్లేనాట.

వూరోల్లు దగ్గెర్రానియ్యని, సిగెల బెట్టుకోని, దండగుచ్చనీకి గూడ దూరముంచిన తంగేడు, జిల్లేడు, గునుగు కట్ల పూలసొంటి పూలను గూడ సిబ్బిల పేర్సి బత్కిచ్చి ఆడిపాడి



Scanned by CamScanner

బత్కమ్మంజేసింది మాదిగాడోల్లేనని సెప్తరు మనోల్లు.

ఎక్కువ తక్కువ, వూరు, వాడ తేడ లేకుంట ఆడోల్లందరు ఆడెటోల్లట.

నాకెర్కున్నంతదాక మా తల్లి. తల్లి తల్లి వరగ్గాడ ఆడినట్లుగూడెవ్వలు జెప్పలే... అంతకన్న ముందే గావచ్చు గిది జరిగి.

అయితేమయిందంటే... మన గూడెపాడామె దొర్సాని బత్కమ్మకు పూలు తెంపుకచ్చి ఇచ్చి, ఇంటికచ్చే వరకు పొద్దంగిందాట, దొర్సానికిచ్చేటప్పుడు ఒల్లేసుకున్న గునుగుబూలు, తంగెడుబూలు, ఇంటి సుట్టున్న కట్లపూలు, బీరపూలు సూరుకుజెక్కిన సిబ్బి దీసుకొని సీకటైతందని దబదబ బత్కమ్మ పేర్సిందాట. బత్కమ్మాడినంక పంచి పెట్టనీకి పిడికెడు గింజలు యింట్ల లేకుండెనాట.

దండెం మీద ఆరేసిన దొబ్బ తున్కను జూసి గిదేమన్న తినగూడందా గిదే పలారమని పంచిపెడ్త, బత్కమ్మా దండం బెడ్త తల్లీ జెర ఏమనుకోకు అని దండెం మీద దొబ్బ దీసి పొయిలేసి కాల్సి బత్కమ్మ పక్కన బెట్టుకోని పోయింది సెరువు కాడికి.....

సెరువు కాడికి సేరకముందే గద్దచ్చి ఆ దొబ్బనెత్కపొయిందాట బిడ్డా....

గది జూసి వూరోల్లంత 'సీ...సీ..ఏమ్మనుషులే మీరు, బత్కమ్మ మీద దొబ్బను బెడ్తారె? గద్దెత్కపోయిందీ... మీ దొబ్బను గాదు మీ బత్కమ్మనే ఎత్కపొయింది. ఈ కాన్నుంచి 'మీరు బత్కమ్మాడద్దు, బత్కమ్మను బదునాం జెయొద్దు, బందువెట్టుండ్రి' అని కరాకండిగ తీర్మాణం జేసిండ్రాట.

గా తీర్మాణాల మీద శాన కొట్లాటలు జరిగినయాట. తల్కాయులు బలిగినయాట, ఆడ్తమని మనోల్లు ఆడద్దని ఆల్లు. ఆకిరికి గుదుపున్నోనికే గుర్రమైనట్లు ఆల్లే నెగ్గిండ్రట.

ఇగ గప్పటి కాన్నుంచి మనోల్లెవ్వరు బత్కమ్మలాడ్తలేరు. అని కత యెల్ల జెప్పింది నర్సవ్వ.

కండ్లు ముయ్యకుంట కదుపుగ్గవట్టి కతయిన్న స్వాతి 'నీయవ్వా... గా సిన్నదానికి గింత పెద్ద బత్కమ్మనొద్దంటారె. గా దొబ్బ పలారం మనోల్లకే పంచి పెట్టనీకి తీస్కపొయె, గాల్లనేమన్న తినుమన్నదా... బత్కమ్మ పక్కపొంటి కాకుంట టిఫిన్‌ల పెట్కపోతె గద్దెత్కపోకపోవు' అని ఇంకా...

'ముసలవ్వా ఇగ గాల్లెవ్వరడ్డమచ్చినా, వద్దన్నా...మేమైతే గీ బత్కమ్మ ఆడ్తనే వుంటం సూడు' కాయంగ చెప్పింది స్వాతి.

ఏప్రిల్ 2003



Scanned by CamScanner